## పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ


పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న డీసీపీ సీతారాం

రఘునాథపల్లి డిసెంబర్ 14 : మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను జనగామ వెస్ట్ జోన్ డీసీపీ సీతారాం గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన లా అండ్ ఆర్డర్‌పై ఆరా తీసి, పలు రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా నడుచుకొని, వారు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించి, తగిన న్యాయం చేయాలన్నారు. ప్రజలు ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను కోరుకుంటున్నారని, దానికి అనుగుణంగా పోలీసులు నడుచుకుంటూ పలువురికి ఆదర్శంగా ఉండాలన్నారు. భూ తగాదాలతో పోలీసుస్టేషన్ వచ్చే వారి ఫిర్యాదులను స్వీకరించి, వారికి రికార్డు పరంగా న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రఘుపతి, సిబ్బంది శ్రీనివాస్, నర్సయ్య, నవీన్, వేణు, రాజ్‌కుమార్, వీరన్న, కవిత పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తుల రిమాండ్

బచ్చన్నపేట, డిసెంబర్ 14 : మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సిబ్బందిపై అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురిని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన సుర సాయిప్రసాద్, జూలుకుంట్ల సురేశ్‌రెడ్డి, గంగరబోయిన అనిల్ ఈ నెల 13న సాయంత్రం ఆటోలో బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్‌లోకి మద్యం తాగి రావడమే కాకుండా విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్లు నర్సిరెడ్డి, రాకేశ్‌పై దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారురు. అంతేకాకుండా స్టేషన్‌లో ఉన్న ఫిర్యాదుదారులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఎంత సముదాయించినా వినకుండా మద్యం మత్తులో విధులకు ఆటంకం కలిగించినట్లు చెప్పారు. ఇందుకు గాను వారి ముగ్గురిపై కేసు నమోదు చేసి, మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**
★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-315036

**WANTED**
★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

# సన్నబియ్యం.. వెన్నులో వణుకు..

- సన్నం బియ్యం ధరలకు రెక్కలు
- వారంలోనే క్వింటాల్‌కు రూ.800 పెంపు
- కిలో రూ.52 నుంచి రూ.60కి పైనే
- కొనలేని స్థితిలో సామాన్యులు
- 'బ్లాక్ మార్కెట్' వల్లే ఈ దుస్థితికి కారణమంటూ ఆరోపణలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నపాలు

హనుమకొండ, డిసెంబర్ 14 : బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. వారం రోజుల్లోనే క్వింటాల్‌పై సుమారు రూ.800 దాకా పెరగడం తో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ పండించిన సన్నాలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తుండడం, మిల్లర్లు, స్టాకిస్టులు, దళారులు నేరుగా రైతుల వద్ద సన్న బియ్యాన్ని కొని 'స్టాక్' చేస్తూ ధరలు నిర్ణయిస్తుండడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్‌లో డిమాండ్ ను ఆసరాగా చేసుకొని మిల్లర్లు, స్టాకిస్టులు, బియ్యం వ్యాపారులు భారీగా ధరలు పెంచుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతేడాది క్వింటాల్ బియ్యం రూ.3వేలు ఉంటే ఇప్పుడు రూ.4వేల నుంచి రూ.6,500 వరకు పెరిగిందని వ్యాపారులు అంటున్నారు. మార్కెట్‌లో పాతవి జై శ్రీరాం కిలో బియ్యం రూ.80, సోనా మసూరి రూ.64, హెచ్‌ఎంటీ రూ. 64 ఉండగా కొత్త బియ్యం రూ.52 నుంచి రూ.60, విజయ మసూరి లాంటి వాటికి రూ.40 నుంచి రూ. 50 వరకు ధర పలుకుతోంది. మున్ముందు కిలో బియ్యం ధర రూ.100కు చేరే అవకాశముందని రైస్ మిల్లర్లు అంటున్నారు. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు.

**సన్నాలకు పెరిగిన డిమాండ్**

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సన్నాలకు చీడ, తెగుళ్లు సోకి దిగుబడి తక్కువ రావడం, ఇతర రాష్ట్రాల్లో సన్నాలను పండించక పోవడం, మన రాష్ట్రంలోని నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం లాంటి ప్రాంతాల్లో దిగుబడి తగ్గడం, ఒక్క గోదావరి బెల్టులోనే సన్నాలు పండుతున్నా సరిపడా అందుబాటులోకి రాకపోవడం, రోజురోజుకూ డిమాండ్ పెరగడంతో మిల్లర్లు, స్టాకిస్టులు, వ్యాపారులు సన్న బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బియ్యం ధరలపై సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే వ్యాపారులు ధరలు పెంచుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నరకం ధాన్యం కొత్తవి క్వింటాల్‌కు రూ.3వేలు, పాతవి రూ. 3,700 ఆల్‌టైమ్ రికార్డుకు చేరాయని ఓ రైస్ మిల్లర్ తెలిపారు. రోజురోజుకూ బియ్యం ధర ఇలా అమాంతం పెరుగుతుంటే కొనేది ఎట్లా అని సామాన్యులు వాపోతున్నారు.

**సన్న బియ్యం కొనలేని పరిస్థితి**



ప్రస్తుతం మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు చూస్తుంటే భయమవుతోంది. సామాన్యులు అసలు సన్న బియ్యం కొనలేని పరిస్థితి వచ్చింది. గత సంవత్సరం కిలో బియ్యం రూ. 30 ఉంటే ఇప్పుడు రూ.60కి పైనే అయింది. ఇంత రేటు పెట్టి ప్రజలు బియ్యం ఎలా కొంటారు? ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి అందరూ ఇబ్బంది పడుతున్నారు. తినే బియ్యం కూడా కొనలేని పరిస్థితి వస్తే ఎట్లా బతుకుడు? అధికారులు చొరవ తీసుకొని బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చూడాలి. సామాన్యులకు అందుబాటు ధరకే సన్న బియ్యం దొరికేలా చూడాలి.

– సంపతి రఘు, హనుమకొండ

**కొనుగోళ్లు తగ్గినయ్**



పదిహేను రోజులుగా బియ్యం వ్యాపారం తగ్గింది. రోజురోజుకూ సన్న బియ్యం ధరలు భారీగా పెరుగుతుండడంతో కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. రోజుకు సుమారు 15క్వింటాళ్ల వరకు అమ్మేవాళ్లం. ఇపుడు 5 క్వింటాళ్లుకూడా అమ్మడం లేదు. బియ్యం ధర రోజుకు రూ.వంద నుంచి రూ.200దాకా పెరుగుతోంది.

– జనగాం శ్రీధర్‌గౌడ్, బియ్యం వ్యాపారి, వడ్డేపల్లి

**వినియోగం పెరగడం వల్లే**

సన్న బియ్యం వినియోగం పెరగడం వల్లే ధరలు పెరుగుతున్నాయి. డిమాండ్‌కు తగినట్లుగా సన్నాలు అందుబాటులో లేవు. రైతులు దొడ్డు రకాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇతర రాష్ట్రాలు, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో సన్నరకం ధాన్యం దిగుబడి సైతం తగ్గిపోయింది.

– ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ

# స్కూలు గుర్తింపు కోసం వసూళ్లు

- డీఈవో ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్
- కలెక్టర్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదులు
- శ్రీవాణిని సస్పెండ్ చేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు

హనుమకొండ సిటీ, డిసెంబర్ 14 : ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు, టీసీ బుక్కుల జారీలో డబ్బు వసూలు ఆరోపణలపై హనుమకొండ డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీవాణిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు డీఈవో ఎం.డి అబ్దుల్ హై గురువారం తెలిపారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ స్కూల్ గుర్తింపు రెన్యువల్ కోసం శ్రీవాణి డబ్బులు డిమాండ్ చేసినట్లు డీఈవోకు ఫిర్యాదు అందింది. ఈ పని కోసం మొదట కొంత మొత్తాన్ని ఓ ఫోన్ నంబరుకు డిజిటల్ పేమెంట్ చేయగా, మిగిలిన కొద్ది మొత్తం కోసం శ్రీవాణి ఫోన్‌లో ప్రైవేట్ స్కూలు నిర్వాహకుడిని అడిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటికే జరిగిన లావాదేవీలు, ఫోన్‌లో మాట్లాడిన రికార్డులతో డీఈవోకు ఫిర్యాదు చేశారు. మరోవైపు డీఈవో ఆఫీసులో పనుల కోసం వచ్చే వారి నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని శ్రీవాణిపై కలెక్టర్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదులు అందాయి. గూగుల్ పే, ఫోన్ పే రూపంలో రూ.10వేలు, రూ.15 వేల చొప్పున పలువురి నుంచి లావాదేవీలు జరిగినట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. లావాదేవీల స్క్రీన్ షాట్లను కలెక్టర్‌కు ఇచ్చారు. డీఈవో ఆఫీసులో డబ్బుల వసూళ్లపై వచ్చిన ఫిర్యాదులపై హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తీవ్రంగా స్పందించారు. విద్యా శాఖ ఆఫీసులో ఏం జరుగుతున్నదని డీఈవోను ప్రశ్నించారు. ఇలాంటి అక్రమాలపై కఠినంగా వ్యవహరించాలని, ఆరోపణలు లేకుండా పరిపాలన కొనసాగాలని ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణిపై వచ్చిన ఫిర్యాదు విషయాలను డీఈవోకు పంపించారు. అనంతరం డీఈవో ప్రాథమికంగా విచారణ చేశారు. టీసీ బుక్కులకు పైసల వసూలుకు సంబంధించి శ్రీవాణిపై ఇప్పటికే పలుసార్లు ఫిర్యాదులు వచ్చాయని డీఈవో నిర్ధారించారు. ఉన్నతాధికారులు, సహచర సిబ్బంది పలుసార్లు హెచ్చరించినా పునరావృతమమైందని డీఈవో విచారణలో తేలినట్లు తెలిసింది. ఈ అంశాల ఆధారంగా సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణిపై వచ్చిన ఫిర్యాదులు, లావాదేవీలకు సంబంధించి స్క్రీన్ షాట్లను, విచారణలోని అంశాలను ఆర్జేడీకి పంపించారు. అన్నింటినీ పరిశీలించిన ఆర్జేడీ కే సత్యనారాయణరెడ్డి గురువారం శ్రీవాణిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో నివేదిక మేరకే శ్రీవాణిపై చర్యలు తీసుకున్నట్లు ఆర్జేడీ తెలిపారు. గెజిటెడ్ స్థాయి అధికారితో సమగ్ర విచారణ చేపడుతామన్నారు. ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లను డీఈవో కార్యాలయం అన్ని ప్రైవేట్, ప్రభుత్వ స్కూళ్లకు అందిస్తుంది. నామమాత్రపు రుసుముతో ఈ బుక్కులను ప్రభుత్వం ఇస్తుంది. వంద సర్టిఫికెట్ల కాపీలు ఉండే బుక్కు ధర రూ.500 చొప్పున ఉంటుంది. ప్రైవేట్ స్కూళ్లకు ఈ బుక్కుల జారీలో శ్రీవాణి అధికంగా వసూలు చేస్తున్నారని డీఈవోకు ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టరుకు నేరుగా, డీఈవోకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆర్జేడీ సత్యనారాయణ చర్యలు తీసుకున్నారు.

**సీల్డ్ కవరు వచ్చింది : డీఈవో ఎండీ అబ్దుల్ హై**

హనుమకొండ డీఈవో ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ శ్రీవాణిపై కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని ఆదేశాలు రావడంతో ఈ అంశాన్ని ఆర్జేడీ ఆఫీసుకు నివేదించాం. శ్రీవాణిని సస్పెండ్ చేస్తున్నట్లు అక్కడి నుంచి సీల్డ్ కవరు వచ్చింది. దీన్ని ఆమెకు పంపించాం.

## వరుణ్‌రెడ్డి.. ఎన్పీడీసీఎల్ సీఎండీ


- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు
- వరుణ్‌రెడ్డిది 2019 ఐఏఎస్ బ్యాచ్

హనుమకొండ సబర్బన్, డిసెంబర్ 14: ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జీవో 1637ను విడుదల చేశారు. గతంలో ఎన్పీడీసీఎల్ సీఎండీగా ఐఏఎస్ ఆఫీసర్ కార్తికేయ మిశ్ర పనిచేశారు. ఆ తర్వాత సీఎండీగా గోపాల్‌రావు కొనసాగారు. ప్రస్తుతం గోపాల్‌రావు పదవీ కాలం పూర్తికావడంతో 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి వరుణ్‌రెడ్డిని నియమించారు.


పశువులను తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న టాస్క్‌ఫోర్స్

రఘునాథపల్లి, డిసెంబర్ 14 : నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్న ముఠా సభ్యులను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని కోమాల్ల టోల్‌గేట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. టాస్క్‌ఫోర్స్ సీఐ పులి రమేశ్ కథనం ప్రకారం.. కొత్తగూడెం జిల్లా చర్ల నుంచి హైదరాబాద్‌లోని బహుదూర్‌పూర్‌కు మూడు డీసీఎంలో సుమారు 68 పశువులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు సీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పశువులను తరలిస్తున్న కొత్తగూడేనికి చెందిన కాళ్ల కృష్ణ, మంగపేటకు చెందిన గుండాటి చంటి, మొర్రె కిరణ్, ఏటూరునాగారానికి చెందిన తిపనపల్లి నరేందర్, ఎండీ ఇర్ఫాన్, భద్రాది కొత్తగూడెం పాల్వంచకు చెందిన గౌస్, కోదాడకు చెందిన బానోత్ మధును అధుపులోకి తీసుకొని, వారి నుంచి మూడు డీసీఎంలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్రమంగా పశువుల ను తరలిస్తే సహించేది లేదని సీఐ రమేశ్ హెచ్చరించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ పులి రమేశ్, రాంబాబు, ఎస్సైలు శరత్, లవకుమార్ పాల్గొన్నారు.


మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న శివకుమార్

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

బచ్చన్నపేట, డిసెంబర్ 14 : మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన చెక్క హన్మయ్య ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని గురువారం గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు కోడూరి శివకుమార్ పరామర్శించారు. తన వంతుగా రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యాట రామచంద్రయ్య, నాగపురి భిక్షపతి, తేలు శ్రీనివాస్, పిట్టల ఇస్తారి, కురాం వెంకటయ్య, చెక్క కనుకయ్య, కొంక కనకయ్య, యాట సాయిలు పాల్గొన్నారు.